సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం : 5 : మార్చి : 2024



ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా 'పల్లెనిద్ర'

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ 'పల్లె నిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోలీస్ యంత్రాంగం భాగస్వాములయ్యేలా కార్యాచరణ రూపొందించారు. - 8లో



పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరం

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా అంగవైకల్యం దూరం చేయవచ్చని వైద్య, ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

జిల్లాలో మంగళవారం 22.4 - 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 04 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు అవగాహన సదస్సు

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికలు-2024 సందర్భంగా మంగళవారం ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్ స్పందన హాలులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ ప్రచార ప్రకటనలు, పెయిడ్ న్యూస్, మీడియా నిబంధనలు తదితర అంశాలపై ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టర్ విజయరామరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మీడియా ప్రతినిధుల తోపాటు డెస్క్ ఇన్‌ఛార్జిలు కూడా హాజరై సదస్సు విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి మంగళవారం నిర్వహించిన ప్రథమ సంవత్సర ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాల్లో 18033 మంది విద్యార్థులకు 17235 మంది హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడ కూడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో బండి వెంకటసుబ్బయ్య, ఇంటర్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి తనిఖీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024-25 కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ పునీత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని గుంటూరు, కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు అగ్నివీర్ జనరల్‌డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీసు, అసిస్టెంట్, స్టోర్‌కీపర్, టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్ మ్యాన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

– కలెక్టర్ విజయరామరాజు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : 'స్పందన' కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందహాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్, జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డ్వామా పీడీ యాదుభూషన్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ఈసీఐ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

కడప సెవెన్‌రోడ్స్ : భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) నిబంధనల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి 1500 మందికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికి జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 22 యాగ్జిలరీ కేంద్రాలతో కలిపి ఆ సంఖ్య 1963కు చేరిందని పేర్కొన్నారు. గండికోట ఆర్‌అండ్‌ఆర్ పరిధిలో 10 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మార్చాల్సి వచ్చిందన్నారు. మొత్తం జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాల లోకేషన్లు మార్చామని తెలిపారు. అలాగే 90 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చామని, కొత్తగా 22 యాగ్జిలరీ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించి రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

నాడు-నేడు..ప్రగతి చూడు

నాడు - నేడు పాఠశాలలు, నిధుల వివరాలు ఇలా..

స్కూళ్ల కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	నిధుల అడ్మిషన్ శాంక్షన్ (రూ.కోట్లలో)
అంగన్‌వాడీలు	87	13.85
స్కూల్స్	909	275.71
జూనియర్ కాలేజీలు	09	7.09
మొత్తం	1005	296.65

నియోజకవర్గాల వారీగా మంజూరు, ఖర్చు చేసిన నిధులు...

నియోజకవర్గం	స్కూళ్ల సంఖ్య	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)	ఖర్చు చేసినవి (రూ.కోట్లలో)
బద్వేల్	164	4731.23	2368.33
జమ్మలమడుగు	156	5109.91	2676.66
కడప	118	2965.48	1730.81
కమలాపురం	157	4123.38	2091.63
మైదుకూరు	169	4472.2	2207.84
ప్రొద్దుటూరు	87	2731.59	1398.13
పులివెందుల	154	4822.82	2308.45

విడుదలైన రివాల్వింగ్ ఫండ్...

నియోజకవర్గం	స్కూళ్ల సంఖ్య	విడుదలైన ఫండ్ (రూ.కోట్లలో)
బద్వేల్	141	3.53
జమ్మలమడుగు	125	3.95
కడప	93	2.11
కమలాపురం	134	3.44
మైదుకూరు	129	2.79
ప్రొద్దుటూరు	69	1.66
పులివెందుల	118	3.79



నాడు నేడు పనుల్లో రూపుదిద్దుకున్న ఓబులవారిపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాల



కడప జయనగర్‌కాలనీలోని జెడ్పీ హైస్కూల్

- జిల్లావ్యాప్తంగా రెండో విడతలో 1006 పాఠశాలల్లో అభివృద్ధి పనులు
- తాజాగా 809 స్కూళ్లకు రూ. 21.28 కోట్లు విడుదల
- మార్చి చివరికి పనులు పూర్తయ్యేలా చర్యలు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు రూపురేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు. పిల్లలకు చదువుకు కావాల్సిన వస్తువులను 'విద్యాకానుక'పేరుతో అందిస్తున్నారు. అలాగే పిల్లలు చదువులో రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న గోరుముద్ద పేరుతో పౌష్టికాహారం అందిస్తున్నారు. అది కూడా రోజుకో మెనుసుతోపాటు కోడిగుడ్లు, రాగిజావ, చిక్కీ అందజేస్తున్నారు. దీంతో పిల్లలు ఆడుతూ పాడుతూ పాఠశాల మెట్లెక్కి విద్యనభ్యసిస్తూ సంతోషంగా ఉన్నారు. జిల్లావ్యాప్తంగా రెండవ విడత కింద 87 అంగన్‌వాడీ కేంద్రాలు, 637 ప్రాథమిక పాఠశాలలు, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూళ్లు, 9 జూనియర్ కళాశాలలు ఇలా మొత్తం 1005 వాటిల్లో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. వీటిలో నాడు - నేడు కింద తాగునీరు, విద్యుత్తు సౌకర్యం,ఫర్నీచర్, గ్రీన్‌చాక్‌బోర్డు, కిచెన్ షెడ్లు, ఇంగ్లీషుల్యాబ్, పెయింట్స్ తదితర పనులు చేస్తున్నారు. ఇందుకోసం రూ. 296.62 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ. 147.81 కోట్ల నిధులను ఖర్చు చేసి పలు అభివృద్ధి పనులను పేరెంట్ కమిటీ, విద్యాశాఖ ద్వారా పనులు చేశారు. మరో రూ. 100 కోట్లకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ఐటమ్స్ అయిన శానిటరీ, విద్యుత్తు సామగ్రి, ఫర్నీచర్, వాటర్‌ప్లాంట్, టీవీలు, గ్రీన్‌చాక్‌బోర్డులను తెప్పించారు. మిగతా నిధులు త్వరలో మంజూరు కానున్నాయి.



తాజాగా 21.28 కోట్లు మంజూరు...

నాడు నేడు పనుల్లో భాగంగా తాజాగా 809 పాఠశాలలకు రూ. 21.28 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగతి గతిన పూర్తి చేయనున్నారు. మార్చి చివరి నాటికి పనులను పూర్తి చేసేందు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక టీమ్‌తో పనుల నిర్వహణ...

జిల్లాలో జరుగుతున్న నాడు- నేడు రెండో విడత పనులకు సంబంధించిన ప్రోగ్రెస్‌పై సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. టీమ్ సభ్యులు పాఠశాలల్లో పనుల ఎలా జరుగుతున్నాయి. వారికి కావాల్సిన మెటీరియల్‌ను సకాలంలో అందించడంతో పాటు ప్రొగెస్ ఎలా ఉంది. ఎక్కడైనా పనుల్లో వెనుకబడి ఉంటే ఎందుకు వెనకపడిందని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

నాణ్యతలో రాజీలేకుండా...



రెండవ విడత నాడు- నేడు పనుల నాణ్యతలో రాజీపడకుండా పనులు నిర్వహిస్తున్నాం. మాతో పాటు పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు కూడా పనుల నాణ్యతను పరిశీలిస్తున్నారు. నిర్ణీత గడువు మార్చి చివరినాటికి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి.

శభాష్ వలంటీర్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ మెరుగైన ఫలితాలు ఇస్తోంది. ఎన్ని పనులున్నా..ఎంతటి ముఖ్యమైన పనినైనా పక్కనపెట్టి అవ్వాతాతలకు సకాలంలో పింఛన్ అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



పులివెందుల టౌన్ : పులివెందులలోని రెడ్డివారి వీధిలో నివాసం ఉంటున్న జి. సుబ్బరాయుడు(65) అనారోగ్యం కారణంగా బెంగళూరులోని సెంజాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి గమనించి బయమ్మతోట సచివాలయ పరిధిలోని వలంటీర్ బి.ప్రదీప్ ప్రేమ్‌సాగర్ సోమవారం ఉదయం బెంగళూరు చేరుకుని ఆ వృద్ధుడికి పింఛన్ నగదు అందజేసి మానవత్వం చాటుకున్నాడు.

తిరుపతికి వెళ్లి..



కమలాపురం : కమలాపురం పట్టణానికి చెందిన యాతం భాగ్య లక్ష్మీ డయాలసిస్ పేషెంట్. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో ఆమె డయాలసిస్ ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ సుధాకర్ సోమవారం తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశారు.దీంతో లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల పరిశీలన



సీఎం ప్రారంభించే మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8న పులివెందులలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా ఆయన పర్యటించే ప్రాంతాలను సోమవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ కౌశిల్ పరిశీలించారు. ముందుగా భాకారాపురంలోని హెలీప్యాడ్‌ను, అక్కడే ఉన్న క్రికెట్ స్టేడియం నిర్మాణాలను పరిశీలించారు.పనులు త్వరత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లుకు సూచించారు. అంబకపల్లె రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మినీ సెక్రటేరియేట్ నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ నుంచి మెయిన్ బజార్‌లోని బోలే వార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆయన పర్యటించే ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పాడా ఓస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జాయింట్‌కలెక్టర్ గణేష్ కుమార్,ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డిఎస్పీ వాసుదేవన్, సిఐలు, శంకరరెడి మద్దిలేటి, ఎస్‌లు, మున్సిపల్ కమీషనర్‌రమణారెడి కాంట్రాక్టర్లు, అధికారులు తదిరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ జిల్లా పర్యటన ఖరారు

7, 8 తేదీల్లో పులివెందులలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 7, 8 తేదీల్లో ఆయన పులివెందులలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన వివరాలిలా ఉన్నాయి.

7వ తేదీన

- సాయంత్రం 4.00 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
- 4.05 గంటలకు అక్కడినుంచి హెలికాఫ్టర్‌లో బయలుదేరి 4.25 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- అక్కడి నుంచి 4.30 గంటలకు వైఎస్సార్ మెమోరియల్ పార్కుకు చేరుకుంటారు.
- 4.30 నుంచి 4.50 గంటల వరకు వైఎస్సార్ మెమోరియల్ పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 4.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.55 గంటలకు ఇడుపులపాయ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.

8వ తేదీ

- ఉదయం 8.20 గంటలకు ఇడుపులపాయ గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 8.25 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 8.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 8.40 గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 8.45 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 8.55 గంటలకు డాక్టర్ వైఎస్సార్ గవర్నమెంటు జనరల్ ఆస్పత్రికి చేరుకుని ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో 9.35 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి రహదారి మార్గంలో బయలుదేరి 9.45 గంటలకు బనాన ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్‌కు చేరుకుంటారు. ప్యాక్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 10.00 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 10.10 గంటలకు డాక్టర్ వైఎస్సార్ మినీ సెక్రటేరియేట్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంటారు.
- 10.25 గంటల వరకు మిని సెక్రటేరియేట్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 10.30 గంటలకు డాక్టర్ వైఎస్సార్ జంక్షన్ వద్దకు చేరుకుంటారు. 10.35 గంటల వరకు జంక్షన్ ప్రారంభోత్సవంలో గడుపుతారు. 10.35 నుంచి 10.40 గంటల వరకు సెంట్రల్ బౌల్ వార్డ్ ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 10.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.50 గంటలకు వైఎస్ జయమ్మ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంటారు.
- 11.00 గంటల వరకు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 11.05 గంటలకు గాంధీ జంక్షన్‌కు చేరుకుని 11.10 గంటల వరకు జంక్షన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 11.15 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ వద్దకు చేరుకుంటారు.
- 11.40 గంటల వరకు లేక్ ఫ్రంట్ ప్రారంభోత్సవంలో గడుపుతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 11.50 గంటలకు ఆదిత్య బిర్లా యూనిట్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.05 గంటల వరకు ఆదిత్య బిర్లా యూనిట్ ఫేస్-1 ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 12.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12.15 గంటలకు హెలిప్యాడ్ సమీపంలోని సంయూ గ్లాస్ వద్దకు చేరుకుంటారు.
- 12.20 గంటలకు టేక్ ఆఫ్ తీసుకుని 12.40 గంటలకు కడప ఎయిర్‌పోర్టులో దిగుతారు.
- 12.50 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 1.40 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 1.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.10 గంటలకు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారు.

ప్రకృతి ఒడిలో..హాయివే!

శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరునగరికి.. శ్రీనివాసుని తొలిగడప కడప నుంచి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఆమోదం లభించింది. జాతీయరహదారుల ప్రాధికారసంస్థ(ఎన్‌హెచ్‌ఐ) టెండర్ల ప్రక్రియపూర్తి చేసింది. 130 కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణం ఉంటుంది. దీనిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా కేంద్రం గుర్తించింది.

- సురక్షిత ప్రయాణానికి కడప-రేణిగుంట ఫోర్‌లైన్
- ప్రాజెక్టు వ్యయం రూ.2,350 కోట్లు
- ఒకటిన్నర గంటలో తిరుపతికి పయనం



హైవే నిర్మాణ క్యాంప్‌ల పనులు



భూసేకరణ జరిగిన ప్రాంతాలివే..

కడప, చింతకొమ్మలదిన్నె, సిద్ధవటం, ఒంటిమిట్ట, నాగిరెడ్డిపలె, పాటూరు(నందలూరు), రాజంపేట, పుల్లంపేట, ఓబులవారి పల్లె, శెట్టిగుంట(రైల్వేకోడూరు)

ఫోర్‌లైన్ ఇలా..

- రేణిగుంట నుంచి కరకంబాడి, మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట వరకు ఉన్న రహదారినే ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు.
- రైల్వేకోడూరుకు ముందుభాగంలో బైపాస్ మార్గం ఏర్పాటు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, భాకరపేట పడమరదిశగా ఫోర్‌లైన్ వెళ్లనుంది

రాజంపేట : శేషాచలం అటవీ ప్రాంతంలో ఆహ్లాదకరమైన ప్రయాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి.ఇందులో భాగంగా 716 కడప-రేణిగుంట జాతీయరహదారిని త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయించింది. రూ. 4వేల కోట్లు వివిధ పనుల రీత్యా కేటాయించింది. ప్రాజెక్టు వ్యయం మాత్రం రూ.2,350 కోట్లుగా నిర్ణయించింది. గత ఏడాది జూలైలో కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. కడప-రేణిగుంట ఫోర్‌లైన్ నిర్మాణపనులను లక్ష్మీఇన్‌ఫ్రా నిర్మాణ సంస్థ చేపట్టేందుకు క్యాంప్‌లను సిద్ధం చేసుకుంటోంది.

తక్కువ వ్యవధిలోనే తిరుపతికి..

- కడప-రేణిగుంట ఎన్‌హెచ్ ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలో తిరుపతికి చేరుకోవచ్చు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారు కడప-రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది.
- కడప-రేణిగుంట రహదారిలో రాజంపేట, రైల్వేకోడూరులో బైపాస్ రహదారి నిర్మించాలని యోచిస్తున్నారు. ముంబై-చెన్నై రైలుమార్గం వెంబడి (పడమర వైపు)భాకరాపేట చిన్నఓరంపాడు వరకు మార్గం నిర్మితం కానుంది. ఈమార్గం పూర్తిగా అటవీమార్గంలోనే కొనసాగుతుంది. మార్గమధ్యలో ఆర్వోబీలు, చెయ్యేరునదిపై వంతెన, చిన్న చిన్న బ్రిడ్జిల నిర్మాణం ఉన్నాయి.

హైవే నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

- కడప-రేణిగుంట నేషనల్ హైవే నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రెండేళ్ల లక్ష్యంగా ఎన్‌హెచ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎంపీ ప్రయత్నిస్తున్నారు.
- ఫారెస్టు, వైల్డ్‌లైఫ్‌కు సంబంధించి కడప-రేణిగుంట నేషనల్ హైవేకు త్వరలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వనున్నాయి. నెలలోపు ఈ అనుమతులు వస్తాయని ఎన్‌హెచ్ వర్గాల సమాచారం. అనుమతులు రాగానే నిర్మాణపనులు పూర్తి చేస్తారు. అటవీశాఖ నుంచి దాదాపు 300 హెక్టార్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే తొమ్మిది మండలాల్లో 1,790.180 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగింది. అటవీశాఖ ఇప్పటికే డీమార్కేషన్, ఎన్యూమరేషన్ పూర్తి చేసింది. కేంద్రానికి నివేదిక వెళ్లింది.
- జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసు రోడ్డు) అవసరమని పలువురు భక్తులు కేంద్రాన్ని కోరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి వెళ్లే యాత్రీకులు ఒంటిమిట్ట రామయ్య, సౌమ్యనాథుని దర్శించుకోవడం ఇటీవల అధికమైంది. అంతేగాకుండా రాయలసీమలో తొలిసారిగా బయల్పడిన బౌద్ధరామాలున్నాయి. పర్యాటకపరంగా ప్రాచుర్యం పొందిన ఒంటిమిట్ట, నందలూరుకు ఎన్‌హెచ్ నుంచి ప్రత్యేకంగా సర్వీసురోడ్డు నిర్మితం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మిథున్‌రెడ్డిని ఇది వరకే వైఎస్సార్‌సీపీ నేతలు కోరిన సంగతి తెలిసిందే. హైవే రావడం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. సర్వీసురోడ్డుగా మారునున్న రహదారిలో ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

త్వరలో అటవీ అనుమతులు



ఫారెస్టు, వైల్డ్‌లైఫ్‌కు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అటవీశాఖ అనుమతుల కోసం కృషిచేస్తున్నాం. త్వరలోనే అనుమతులు రానున్నాయి. రెండు ప్యాకేజీలుగా కడప-రేణిగుంట జాతీయరహదారి నిర్మాణపనులు జరుగుతాయి. గ్రీన్‌హైవే ఎక్స్‌ప్రెస్‌లో ఆహ్లాదకరమైన వాతవరణంలో త్వరితగతిన గమ్యాలకు చేరుకువచ్చు.
– పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

సురక్షిత ప్రయాణం



తొలిగడప కడప నుంచి తిరుపతికి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం వల్ల రద్దీ క్రమబద్ధీకరణవుతుంది. ఈ మార్గంలో స్పెషల్ సర్వీసు రోడ్డు నిర్మితం చేయాల్సి ఉంది. ఉభయ వైఎస్సార్ జిల్లా వాసులే కాకుండా, ఉత్తరభారతదేశానికి చెందిన వారు సకాలంలో తిరుపతి, చెన్నైలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. అటవీ అనుమతులు రాగానే నిర్మాణసంస్థ పనులు చేపడుతుంది.
– మేడారఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా 'పల్లెనిద్ర'

- శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఆట కట్టించడమే లక్ష్యం
- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ దేశాలతో కదిలిన పోలీసు యంత్రాంగం



పల్లె నిద్ర, గ్రామ సభ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : శాంతి భద్రతల పరిరక్షణ, స్వేచ్ఛాయుత, ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ 'పల్లె నిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని పోలీస్ యంత్రాంగం మొత్తం భాగస్వాములయ్యేలా కార్యాచరణను రూపొందించారు. ఇందులో భాగంగా అసాంఘిక శక్తుల ఆట కట్టించడంతో పాటు ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ ఆయా గ్రామాల్లో ప్రజలకు గ్రామ సభలు నిర్వహించి ఎన్నికలపై ఎస్ఐ నుంచి ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో పల్లెలో గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో విస్తృతంగా చర్చిస్తారు. అలాగే గ్రామాల్లోని సమస్యలను కూడా తెలుసుకుంటారు. గ్రామంలో అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. గ్రామాల వారీగా డేటాను సేకరించి నమోదు చేసుకుంటారు.

పోలీస్ స్టేషన్‌ల వారీగా 'పల్లె నిద్ర'

పోలీస్ స్టేషన్‌ల వారీగా అధికారులు పలెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గ్రామస్తులకు వివరిస్తారు. జైలు నుంచి విడుదలై వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు, స్థానికేతరులపై కూడా ఓ కన్నేసి ఉంచుతారు. అనంతరం ఆ గ్రామంలోనే నిద్రిస్తారు.

డేటా సేకరణ : వివిధ కేటగిరీలుగా గ్రామాల వారీగా పోలీసు అధికారులు సమాచారాన్ని సేకరిస్తారు. ఆ డేటాను నమోదు చేసుకుంటారు. సదరు డేటా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయం వరకూ అందుబాటులో ఉంటుంది. శాంతి భద్రతల పరిరక్షణ కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏదైనా సమస్య తలెత్తినా, ఘటన జరిగినా వెంటనే స్పందించి కార్యాచరణకు ఉపక్రమించేందుకు ఈ డేటా ఉపయోగపడుతుంది.

శాంతి భద్రతల పరిరక్షణ.. అసాంఘిక శక్తుల కట్టడి

జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



అసాంఘిక శక్తులను కట్టడి చేయడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఈ 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని రూపొందించాం. ఇందులో మొత్తం పోలీస్ యంత్రాంగం భాగస్వామ్యమవుతుంది. ప్రతి గ్రామానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు దోహదపడుతుంది. ప్రతి రోజు ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామ సభలు నిర్వహించడం, 'స్పందన'లో సమస్యల పరిష్కారం, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల సందర్శన, పీస్ కమిటీ సమావేశాలు, గ్రామ సర్వే, పోలింగ్ కేంద్రాల పరిశీలన, చెడునడత, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారికి పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ముమ్మందు సత్ప్రవర్తనతో మెలగకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సందర్శించి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేసేందుకు తాము అండగా ఉన్నామని భరోసా కల్పించడంతో పాటు ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లోను కావద్దని సూచిస్తున్నాం.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



నేను పులివెందుల పట్టణంలోని రోటరీ పురంలో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నాను. గత టీడీపీ, కాంగ్రెస్ పార్టీల హయాంలో ఇంటి కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసిన కొన్ని నెలల్లోనే నాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. మా ఆయన కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జగనన్న కాలనీలో ఇల్లు పూర్తి అయితే ఆ కాలనీలో చేరుతాం.

- నాగలక్ష్మి, పులివెందుల

సర్వాంగ సుందరంగా పాఠశాలలు



సర్వాంగ సుందరంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా పాఠశాల భవనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారు. నాడు.. నేడు కింద ఈ భవనాలు శాశ్వతంగా పక్కా నాణ్యతతో నిర్మించడం ఎంతో సంతోషకరం. పేదింటి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం ఈ భవనాలను ఎంతో మెచ్చుకుంటున్నారు. సీఎం జగన్ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు.

- ఎస్.నాగమల్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, చిన్నమండెం

మద్యం మత్తులో భర్త ఘాతుకం



బాధితురాలిని పరామర్శిస్తున్న స్థానికులు

పోరుమామిళ్ల : మద్యం మత్తులో భర్త చేసిన ఘాతుకానికి ఇంటిలో వస్తువులు బుగ్గి పాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. జీబీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న కొడవటిగంటి లూర్దుమేరీ సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా 9 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్త శౌరి ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఆమె తప్పించుకొని పక్క ఇంటికి వెళ్లింది. దాంతో భర్త శౌరి ఆగ్రహంతో అగ్గిపుల్ల వెలిగించి, భార్య చీరలపై వేసి నిప్పంటించాడు. చీరలతో పాటు, వస్తువులు కాలిపోగా, ఇంటికి నిప్పంటుకుంది. ఇరుగు పొరుగు వారు మంటలను ఆర్పుతూ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పి ఇంటిని కాపాడారు. విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్, ఆ పార్టీ కార్యకర్తలు గౌసియా, వెంకటలక్షుమ్మ, బీబీ, రవి, వెంకటరత్నం తదితరులు లూర్దుమేరీని విచారించి సానుభూతి తెలిపారు.

పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరం



ఇంటింటికి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

బద్వేలు అర్బన్ : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా అంగవైకల్యం దూరం చేయవచ్చని వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ కె.వి.ఎస్.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న ఇంటింటికి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల చేత తొలిరోజు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులందరిని గుర్తించి తప్పకుండా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అనంతరం గాంధీనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌ను సందర్శించి వైద్యాధికారులకు, సిబ్బందికి సూచనలిచ్చారు. అలాగే పట్టణంలోని పద్మావతి నర్సింగ్ హోంను తనిఖీ చేసి ఆరోగ్యశ్రీ అమలు, జననీ సురక్ష యోజన పథకం, ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం గురించి ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. అలాగే ఆర్టీసీ బస్టాండులో నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్, వైద్యాధికారులు డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు శివరామిరెడ్డి, ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై బదిలీ వేటు

చాపాడు : మండల పరిధిలోని అన్నవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌరై శ్రీనివాసులు పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడటంతో బదిలీ వేటు పడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీకి సంబంధించిన ఇంటి పన్ను, కుళాయి పన్నులకు సంబంధించిన రూ. 39 వేలు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు సొంత అవసరాలకు వాడుకుని పంచాయతీకి నష్టం కలిగించినట్లు గ్రామ సర్పంచ్ ఆలూరు పీరయ్య గత నెలలో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 17న డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు గ్రామ సచివాలయంలో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి రూ.39వేలు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారు. దీంతో దుర్వినియోగం అయిన నిధులు వసూలు చేసి, పంచాయతీ కార్యదర్శిని కలసపాడు మండలంలోని పుల్లారెడ్డిపల్లెకు బదిలీ చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్ బీ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

చాపాడు : భక్తులకు ఇబ్బందులు లేకుండా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ అన్నారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆలయ చైర్మన్ వైవీ వెంకటసుబ్బారెడ్డి(ఉదయ్) సమీక్షా సమావేశం నిర్వహించారు. శివరాత్రి జాగరణ, తిరునాల రెండు రోజులలో భక్తులకు బస్సు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, పార్కింగ్ స్థలం, దర్శనం కోసం బారికేడ్లు, మంచినీటి వసతి, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ వై.భూషణం, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పొలతలలో జోరుగా ఉత్సవాల ఏర్పాట్లు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులుల ఆధ్వర్యంలో జోరుగా జరుగుతున్నాయి. ఈనెల 7వతేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనేరులో పూడికతీత పనులు, పారిశుధ్యం, ఆలయ పరిసరాలల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఆలయ ఆవరణంలో ఆర్టీసీ బస్సులకు, ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని చదును చేస్తున్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు









కడప అర్బన్ : కడప నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందుతున్న గుర్తు తెలియని వారి మృతదేహాలను మార్చురీలో ఉంచారు. వారి గురించి తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే తమను సంప్రదించాలని ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనాథ మృతదేహం లభ్యం

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలో గండికోట రిజర్వాయర్ రహదారిలోని ఓ వంకలో మృతదేహాన్ని(50) సోమవారం పోలీసులు గుర్తించారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు కొద్దిరోజుల క్రితం యేసు కరుణాలయ ఆశ్రమంలోని బీహార్‌కు చెందిన ఓ అనాథ కనిపించలేదు. లభ్యమైన మృతదేహం 10 రోజుల క్రితం నుంచి కనిపించకుండా పోయిన బీహార్ వ్యక్తిదని, కరుణాలయ మేనేజర్ ద్వారా గుర్తించినట్లు ఆయన తెలిపారు. మృతునికి మతి స్థిమితం లేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోనంపేట క్వారీలో బాంబ్ బ్లాస్ట్ : యువకుడి మృతి



మృతి చెందిన శివారెడ్డి

లక్కిరెడ్డిపల్లె : కోనంపేట గ్రామ సమీపంలోని మురళి కంకర మిషన్ క్వారీలో ఆదివారం జరిగిన బాంబ్ బ్లాస్ట్‌లో ముద్దనూరుకు చెందిన శివారెడ్డి(28) అనే యువకుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్వారీలో జరిగిన బాంబ్ బ్లాస్ట్‌లో మృతి చెందిన శివారెడ్డిని స్థానికులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ.విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా ముద్దనూరుకు చెందిన శివారెడ్డి(28) క్వారీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడటంతో మృతి చెందినట్లు తెలిపారు.

గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో లారీ-బస్సు ఢీ

యువకుడి మృతి



ప్రమాదానికి గురైన ఇంద్ర బస్సు



రిత్విక్ సాయి (ఫైల్)

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండల పరిధి లోగల గువ్వలచెరువు ఘాట్ రోడ్‌లోని మొదటి మలుపు వద్ద సోమవారం తెల్లవారుజామున ఏపీ04 జెడ్ 0397 నంబరు గల ఇంద్ర బస్సును లారీ ఢీకొని లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కడప సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ పనిచేస్తున్న శ్రీనివాసరావు కుమారుడు రిత్విక్ సాయి (22) తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చింతకొమ్మదిన్నె ఎస్ఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఇంద్ర బస్సు కడప నుంచి బెంగళూరుకు వెళుతుండగా రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న రిత్విక్ సాయి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. లారీ లోయలోకి దూసుకెళ్లడంతో లారీ డ్రైవర్ ఎల్ఎస్ నాథుడికి గాయాలయ్యాయని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పలువురు అధికారుల పరామర్శ

కడప సెవెన్‌రోడ్స్ : సమాచార పౌరసంబంధాలశాఖ కడప కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ శ్రీనివాసరావు కుమారుడు రిత్విక్‌సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు అధికారులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. సీఏ కోర్సు పూర్తయి ఇంటర్న్‌షిప్ చేస్తున్న కుమారుడు మరణించడంతో డీఈఐఈ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ విషాద సంఘటన గురించి తెలుసుకున్న సమాచార పౌరసంబంధాలశాఖ రాష్ట్ర కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఫోన్ చేసి శ్రీనివాసరావును పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పౌరసంబంధాలశాఖ ఆర్‌జేడీ మహబూబ్‌బాషా, డీఐపీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా డీఐపీఆర్‌ఓ భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, డివిజనల్ పీఆర్‌ఓలు మస్తాన్ సాహెబ్, సునీల్ సాగర్, పీఆర్‌ఓలు, సిబ్బంది రిత్విక్‌సాయి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బియ్యం దుకాణాల ఆకస్మిక తనిఖీ

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని బియ్యం దుకాణాలను ప్రొద్దుటూరు లీగల్ మెట్రాలజి డిపార్టుమెంట్ ఇన్‌స్పెక్టర్ పి. జయదేవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్యాకింగ్ తేదీలు, ఎమ్మార్పీ ధరలు సరిగాలేని వాటిని గుర్తించి 6 కేసులు నమోదు చేశారు. రూ.25వేల వరకు జరిమానాలు విధించారు.

కుంట ఆక్రమణ

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కుంటను ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి ఆక్రమించి పొలం చదును చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చదును చేస్తున్న ట్రాక్టర్లను వెనక్కి పంపించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత వంద సంవత్సరాల నుండి కుంట ఉండని, పశువులకు తాగునీటికి ఉపయోగపడుతోందన్నారు. రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో కుంట కట్టకు మరమ్మతులు చేశామన్నారు. 928 సర్వే నంబరులో 9.28 ఎకరాల భూమిని ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి కొనుగోలు చేశాడన్నారు. అయితే అతను కొలతలు వేయించుకోకుండా కుంటను దున్నేశాడని వాపోయారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త డ్రామాలకు తెరలేపిన బీటెక్ రవి

లింగాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : ఇటీవల జరిగిన పరిణామాలలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య వెనుక ఎవరెవరు ఉన్నారో గ్రామ స్థాయిలో ఉన్న మహిళలకు సైతం తెలుసు అని లింగాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, మనోహరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేష్, రాధాకృష్ణ, రఘురామకృష్ణమరాజు, బీటెక్ రవి, మహాసేన రాజేష్‌తో పాటు కొన్ని వ్యవస్థలు పనిచేసిన తీరు, తెర వెనుక ఉన్న పేర్లు కొన్ని బయటకు రావడంతో దిక్కుతోచని స్థితిలో టీడీపీ నాయకులు నార్కో అనాలసిస్ అనే కొత్త డ్రామాలను తెరపైకి తెచ్చారన్నారు. దస్తగిరి బెదిరించిన వీడియోలు, ఫొటోలతో పాటు కిడ్నాప్‌లు చేస్తాం, పోలీసులైతే నాకేమని చెబుతున్న వీడియోలు బయటకు వచ్చాయన్నారు. అలాగే సెంట్రల్ జైలులో తనను డాక్టర్ చైతన్యరెడ్డి బెదిరించి డబ్బు ఆశ చూపాడని దస్తగిరి అబద్ధాలు చెప్పడం.. ఈ విషయాలపై డాక్టర్ చైతన్య మీడియాకు వాస్తవాలు వివరించడంతో ఖంగుతున్న టీడీపీ బ్యాచ్ నార్కో అనాలసిస్ అని కొత్త డ్రామాను తెరపైకి తెచ్చాచ్చిందన్నారు. నిజం-గెలవాలి- న్యాయం గెలవాలి అనే నినాదంతో దాదాపు 5 సార్లు సీబీఐ విచారణకు హాజరై వారు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాత సీబీఐ ఆరోపణలలో వాస్తవం లేదని కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే అన్నారు. కోర్టులు పర్మిషన్ ఇస్తేగాని నార్కో అనాలసిస్ చేయరనే పరిజ్ఞానం కూడా బీటెక్ రవికి లేదన్నారు. బీటెక్ రవి కారణంగా హైదరాబాదులో ఒక అమ్మాయి మరణించింది. అది ఆత్మ హత్యనా లేక నువ్వు హత్య చేసి ఉరి వేశావా అనే దానిపై కూడా నార్కో అనాలసిస్‌కు సిద్ధమా అని సవాల్ విసిరారు. తమ నాయకునికి దేవుని ఆశీస్సులు, ప్రజల మద్దతు ఉన్నంతవరకు మీలాంటి 420లు, చంద్రబాబు లాంటి 820లు, రాధాకృష్ణలాంటి 1680లు ఎంతమంది ఎన్ని చేసినా ఏమీ చేసుకోలేరన్నారు. మీరు చేసే కుట్రలు, తెర వెనుక చేస్తున్న లాబీయింగ్ , వ్యవస్థలను మేనేజ్ చేయడంవల్ల కేసులకు సంబంధం లేని వైఎస్ భాస్కరరెడ్డి,, దేవిరెడ్డి శివశంకరరెడ్డి , ఉదయ్‌కుమార్‌రెడ్డిలు జైలులో ఉన్నారని చెప్పారు.

అంతా చంద్రబాబు డైరెక్షన్

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు కోర్టు పరిధిలో ఉందని.. ఇందుకు సంబంధించి టీడీపీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లో టీడీపీ నాయకులు నడుస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ బీటెక్ రవి పులివెందులలో ఇచ్చిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందన్నారు. బీటెక్ రవి తాను నార్కో అనాలసిస్‌కు సిద్ధంగా ఉన్నానని.. మరి మీ నాయకుడు సిద్ధమా అని చెప్పారన్నారు. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్న విషయం బీటెక్ రవికి తెలియదా అని ప్రశ్నించారు. స్క్రిప్ట్, డైరెక్షన్ అంతా మీరే ఇస్తున్నారని.. దాన్ని చూసి నర్రెడ్డి సునీత మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బీటెక్ రవి లేనిపోని అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

వివేకానందరెడ్డిని వెనుకేసుకొని రావడం ఒక విడ్డూరం అయితే వైఎస్ అవినాష్‌రెడ్డిని నార్కోఅనాలసిస్‌కు రమ్మనడం బీటెక్ రవి అవివేకానికి నిదర్శనమన్నారు. టీడీపీ నాయకులంతా వైఎస్ అవినాష్‌రెడ్డిపై ఎన్ని నిందలు మోపినా నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని.. న్యాయం ఎప్పుడైనా గెలుస్తుందదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్ కోడి రమణ తదితరులు పాల్గొన్నారు.